GSTIN:36FDKPS1308P1ZX

# టి-మీడియా

MEDIA

సామాజికం ... ప్రజల పక్షం...

టీమీడియా ప్రత్యేక సంచిక





# పొలిటికల్ కుదుపులు సంచలనాలు

## ఢిల్లీ పీఠాన్ని కోల్పోయిన ఆప్

## 27 ఏళ్ల తర్వాత హస్తినలో బీజేపీ పాగా

**2025 సంవత్సరంలో మన దేశ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కంచుకోటగా ఉన్న ఢిల్లీలో 27 ఏళ్ల తర్వాత బీజేపీ పాగా వేసింది. అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారనే అభియోగాలు ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఇమేజ్‌ను మసకబార్చాయి. ఆయన్ను అధికార పీఠానికి దూరం చేశాయి. అనూహ్యంగా ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖర్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. కేంద్ర ప్రభుత్వంతో విభేదాల వల్లే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారనే ప్రచారం జరిగింది.**



**టి మీడియా,డిసెంబర్ 24,ఢిల్లీ బ్యూరో :**

బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై విపక్షాలు సంచలన ఆరోపణలు చేశాయి. ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల చోరీకి కేంద్ర ఎన్నికల సంఘం పాల్పడుతోందని ఆరోపించాయి. ఎస్ఐఆర్ నిర్వహణపై సుప్రీంకోర్టు పలు ఆదేశాలివ్వగా, ఈసీ కొన్ని వివరణలు ఇచ్చుకుంది. ఈనేపథ్యంలో బిహార్‌లో జరిగిన ఎన్నికల్లో మళ్లీ ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించింది. 10వసారి నీతీశ్ సీఎం అయ్యారు. ఇక ఇదే సమయంలో బిహార్‌లోని లాలూ ఫ్యామిలీలో చీలిక అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఈ పొలిటికల్ కుదుపులు, సంచలన పరిణామాల సమగ్ర సమాచారంతో ఈటీవీ భారత్ 2025 - ఇయర్ ఎండర్ మీకోసం!

**ఢిల్లీ పీఠం : బీజేపీ విజయం- కేజ్రీవాల్ ఓటమి**

దేశ రాజధాని ఢిల్లీలో 1998 నుంచి 2025 వరకు కేవలం రెండు పార్టీల హవా వీచింది. 1998 నుంచి 2013 వరకు హస్తినను హస్తం పార్టీ ఏలింది. 2013 నుంచి 2025 వరకు ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీని వరుస విజయాలు వరించాయి. కానీ ఈ ఏడాది(2025) ఫిబ్రవరి 5న జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఫలితం వచ్చింది. ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో 48 సీట్లను బీజేపీ కైవసం చేసుకుంది. ఆప్ 22 సీట్లకే పరిమితమైంది. 27 ఏళ్ల తర్వాత తొలిసారిగా ఢిల్లీ గడ్డపై బీజేపీ సర్కారు ఏర్పాటైంది. షాలిమార్‌బాగ్ ఎమ్మెల్యే రేఖాగుప్తా ఢిల్లీ సీఎం అయ్యారు. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తన సిట్టింగ్ స్థానం (న్యూఢిల్లీ నియోజకవర్గం)లో బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మ చేతిలో 3,182 ఓట్ల తేడాతో ఓడిపోవడం సంచలనం సృష్టించింది.2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీలోని 70 సీట్లలో 62 స్థానాలను ఆప్ గెల్చుకుంది. ఆ ఎన్నికల్లో బీజేపీకి 8 సీట్లే వచ్చాయి. కానీ ఈసారి లెక్క రివర్స్ అయింది. ఆప్‌కు చెందిన 62 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలలో 40 మంది ఓడిపోయారు. ఆశ్చర్యకరంగా ఈ 40 సీట్లన్నీ ఈసారి నేరుగా బీజేపీ ఖాతాలో చేరాయి. తద్వారా ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 48 సీట్లను కమలదళం చేజిక్కించుకుంది. గతంలో ఢిల్లీని ఏకఛత్రాధిపత్యంగా ఏలిన కాంగ్రెస్ వరుసగా మూడోసారి ఒక్క సీటును కూడా గెలవలేకపోయింది.కేజ్రీవాల్?పై అవినీతి ఆరోపణలు: అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ సీఎం హోదాలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. మద్యం పాలసీ రూపకల్పన సందర్భంగా మద్యం సిండికేట్ల నుంచి ఆయన ముడుపులను పుచ్చుకున్నారనే అభియోగాలతో కేసులు నమోదయ్యాయి. సీఎం అధికారిక నివాసం పునరుద్ధరణ పనులకు సంబంధించిన 'శీష్ మహల్' వివాదం ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసింది.

**ఉప రాష్ట్రపతి పదవి : జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్య రాజీనామా**

జగదీప్ ధన్‌ఖడ్ ఉప రాష్ట్రపతి పదవికి అకస్మాత్తుగా రాజీనామా చేయడం అనేది ఈ ఏడాది సంచలన అంశం. 2022 సంవత్సరం ఆగస్టు 11న ఉప రాష్ట్రపతి పదవిని చేపట్టిన ఆయన 2025 జులై 21న రాజీనామా చేశారు. ఉప రాష్ట్రపతి కాకముందు బీజేపీలో సీనియర్ నేతగా జగదీప్ ధన్‌ఖడ్ మంచిపేరు తెచ్చుకున్నారు. ఆయన 2003 సంవత్సరం నుంచి బీజేపీలో వివిధ హోదాల్లో సేవలు అందిస్తున్నారు. పార్టీ వ్యవహారాలు, సిద్ధాంతాలపై ఆయనకు పూర్తి పట్టు, అవగాహన ఉన్నాయి. సాధారణంగా ఉప రాష్ట్రపతి పదవిని చేపట్టే వారు ఐదేళ్ల పాటు అందులో కొనసాగుతారు. కానీ జగదీప్ ధన్‌ఖర్ మూడేళ్లకే ఎందుకు రాజీనామా చేశారు అనేది పెద్ద ప్రశ్న. తన ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, వైద్యుల సలహా మేరకు పదవి నుంచి తప్పుకుంటున్నట్లు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మకు పంపిన రాజీనామా లేఖలో జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు.

**రాజీనామా వెనుక ఇతరత్రా కారణాలు**

అధికారికంగా ఆరోగ్య కారణాలను జగదీప్ ధన్‌ఖడ్ చెప్పినప్పటికీ, రాజీనామా వెనుక ఇతరత్రా కారణాలు ఉన్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో జరిగింది. జస్టిస్ యశ్వంత్ వర్మను తొలగించాలని 63 మంది ప్రతిపక్ష ఎంపీలు ఇచ్చిన నోటీసును రాజ్యసభ ఛైర్మన్ హోదాలో జగదీప్ ధన్‌ఖడ్? ఆమోదించారు. ఈ నిర్ణయం కేంద్ర ప్రభుత్వ పెద్దలకు నచ్చలేదనే కథనాలు వచ్చాయి. కొన్ని సందర్భాల్లో ఆయన తీసుకున్న పలు నిర్ణయాల వల్ల, కేంద్ర ప్రభుత్వంతో గ్యాప్ పెరిగిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. రాజ్యసభ ఛైర్మన్‌గా ధన్‌ఖర్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రతిపక్షాలు గతంలో ఆయనపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాయి.

కొత్త ఉప



రాష్ట్రపతి ఎన్నిక

జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో 2025 సెప్టెంబరులో ఉప రాష్ట్రపతి ఎన్నిక నిర్వహించారు. సీపీ రాధాకృష్ణన్ 2025 సెప్టెంబరు 12న భారత కొత్త ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించారు.

**ఎస్ఐఆర్‌పై రగడ : ఈసీపై విపక్షాల ఆరోపణలు**

ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఈ ఏడాది పెద్ద రాజకీయ రగడ జరిగింది. కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ), బీజేపీపై విపక్షాలు సంచలన ఆరోపణలు చేశాయి. సరిగ్గా అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందే బిహార్‌లో ఎస్ఐఆర్‌ను ఎందుకు నిర్వహిస్తున్నారని నిలదీశాయి. ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డులను ధృవీకరణ పత్రాలుగా అంగీకరించబోమని అప్పట్లో ఈసీ చెప్పడం పెద్ద వివాదానికి దారితీసింది. తమకు మద్దతు ఇచ్చే మైనారిటీలు, దళితులు, యువత ఓట్లను చోరీ చేసేందుకు, వాటిని తొలగించేందుకు ఈసీ కసరత్తు చేస్తోందని ఆర్‌జేడీ, కాంగ్రెస్ ఆరోపించాయి.


ఈనేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై 'అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్' వంటి సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. మరోవైపు జూన్ 25న బిహార్ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఈసీ ప్రారంభించింది. జూలై 10న ఎస్ఐఆర్ ప్రక్రియపై ఈసీకి సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక ఆదేశం ఇచ్చింది. ఓటర్ల గుర్తింపు, నమోదు కోసం ఆధార్, రేషన్ కార్డు, ఓటర్ ఐడీలను ప్రాథమిక ధృవీకరణ పత్రాలుగా అంగీకరించాలని నిర్దేశించింది. దీంతో ఆ మేరకు ఎస్ఐఆర్ నిర్వహణ నిబంధనల్లో ఈసీ మార్పులు చేసింది. జులై 25న బిహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ ముగిసింది.ఆగస్టు 1న బిహార్ ఓటర్ల ముసాయిదా జాబితాను ఈసీ ప్రచురించింది. దీని ప్రకారం దాదాపు 65 లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితాల నుంచి తొలగించారు. తదుపరిగా ఓటర్ల జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ, సవరణల ప్రక్రియను ఈసీ మొదలుపెట్టింది. ఈక్రమంలో ఆగస్టు 14న సుప్రీంకోర్టు మరోసారి ఈసీకి ఆదేశాలు ఇచ్చింది. ఓటర్ల తుది జాబితా తయారీలో పారదర్శకత ఉండాలని, తొలగించిన ఓటర్ల వివరాలను బహిర్గతం చేయాలని నిర్దేశించింది. ఆధార్ వంటి పత్రాలను ఓటర్ల ధృవీకరణకు అనుమతించాలని పునరుద్ఘాటించింది. ఆధార్ కార్డును ఓటరు గుర్తింపు కోసం 12వ అధికారిక పత్రంగా చేర్చాలని ఈసీకి సెప్టెంబర్ 8న సుప్రీంకోర్టు మరో ఆర్డర్ ఇచ్చింది. సెప్టెంబర్ 9న కేంద్ర ఎన్నికల సంఘం బిహార్ ప్రధాన ఎన్నికల అధికారికి ఒక లేఖ రాసింది. ఓటర్ల నమోదు ప్రక్రియలో ఆధార్‌ను గుర్తింపు కార్డుగా అంగీకరించాలని అధికారికంగా ఆదేశించింది. ఎట్టకేలకు సెప్టెంబర్ 30న బిహార్ తుది ఓటర్ల జాబితాను ఈసీ ప్రచురించింది. దీని ఆధారంగానే 2025 నవంబరులో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి.

**దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ ఎస్ఐఆర్**

బిహార్ తరహాలోనే ప్రస్తుతం తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరిలలో కూడా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్వహిస్తున్నారు. అయితే, దీనిపై కూడా పలు రాజకీయ పార్టీలు (ఉదాహరణకు తమిళనాడులో డీఎంకే) సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ప్రస్తుతం చట్టపరమైన సవాళ్ల మధ్య ఈ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోంది.

**ఓట్ల చోరీ ఆరోపణలు : ఈసీ వివరణలు**

ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలోని చాలా అంశాలపై విపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశాయి. ఆగస్టు 1న ఈసీ విడుదల చేసిన బిహార్ ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకారం దాదాపు 65 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారు. దీనిపై విపక్ష పార్టీలు మండిపడ్డాయి. తమకు అనుకూలంగా ఉండే దళితులు, ముస్లింలు, ఓబీసీలు, నిరుపేద వర్గాల ఓట్లను వ్యూహాత్మకంగా తొలగించారని ఆరోపించాయి. బీజేపీ, ఈసీ కలిసి ఓట్లచోరీకి పాల్పడుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆర్‌జేడీ అగ్రనేత తేజస్వి యాదవ్ ఫైర్ అయ్యారు. బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఈసీ పనిచేస్తోందని విమర్శించారు. ఓటర్ల నమోదు, తొలగింపు ప్రక్రియలో ఒక "ప్రత్యేక సాఫ్ట్‌వేర్"ను ఉపయోగించి తమ మద్దతుదారులను ఏరివేస్తున్నారని విపక్ష నేతలు పేర్కొన్నారు. తమ వాదనను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 1 వరకు 16 రోజుల పాటు విపక్ష కూటమి "ఓటర్ అధికార్ యాత్ర"ను




బిహార్‌లో నిర్వహించింది. రాహుల్ గాంధీ సారథ్యంలో ఈ యాత్ర జరిగింది.

**ఎస్ఐఆర్‌పై ఈసీ ఏం చెప్పింది**

జులై 27, 2025: అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని ఈసీ స్పష్టం చేసింది.ఆగస్టు 17, 2025: బిహార్‌లో తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేవలం 56 గంటల్లోనే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ తెలిపారు.

ఆగస్టు 24, 2025: ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ రాజ్యాంగబద్ధంగా, పారదర్శకంగా జరుగుతోందని, 98.2% మంది ఓటర్ల ధృవీకరణ పూర్తయిందని ఈసీ ప్రకటించింది.సెప్టెంబర్ 30, 2025: తుది జాబితా ప్రచురణ సందర్భంగా ఈసీ కీలక ప్రకటన చేసింది. రాజకీయ లబ్ధి కోసమే విపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని మండిపడింది. ఎవరైనా ఆధారాలతో సహా ఏడు రోజుల్లోగా అఫిడవిట్ సమర్పిస్తే విచారణకు సిద్ధమని సవాల్ విసిరింది.

బిహార్‌లో మళ్లీ ఎన్‌డీఏ- పదోసారి నీతీశ్ ప్రమాణంబిహార్?లో ఎస్ఐఆర్ వివాదం నడుమ నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం నీతీశ్ కుమార్ సారథ్యంలోని ఎన్డీఏ ఘన విజయం సాధించింది. విపక్ష ఇండియా కూటమికి 2025లో బిగ్ షాక్ తగిలింది. బిహార్‌పై కాంగ్రెస్, ఆర్‌జేడీ పెట్టుకున్న గంపెడాశలు ఆవిరయ్యాయి. నవంబరు 6, 11



తేదీల్లో రెండు విడతల్లో జరిగిన అసెంబ్లీ పోల్స్‌లో తిరుగులేని మెజారిటీతో ఎన్‌డీఏ కూటమి విజయఢంకా మోగించింది. మొత్తం 243 స్థానాలకుగానూ 202 సీట్లను ఎన్‌డీఏ కైవసం చేసుకుంది. ఎన్నికల్లో నమోదైన మొత్తం ఓట్లలో 47.2 శాతం ఎన్‌డీఏకు, 37.3 శాతం ఓట్లు ఇండియా కూటమికి పడ్డాయి. ఈ 10 శాతం ఓట్ల తేడా వల్లే ఎన్‌డీఏకు ఏకపక్ష విజయం దక్కింది. జేడీయూ అధినేత నీతీశ్ కుమార్ పదోసారి బిహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి రికార్డు సృష్టించారు. బీజేపీకి చెందిన సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హాలను ఉప ముఖ్యమంత్రులుగా చేశారు.

**లాలూ కుటుంబంలో చీలిక : తేజ్ ప్రతాప్, రోహిణి ఆచార్య దూరం**


ఈ ఏడాది ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబం ప్రముఖంగా జాతీయ స్థాయిలో వార్తల్లో నిలిచింది. బిహార్ రాజకీయాల నుంచి లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబాన్ని వేరుచేసి చూడలేం. 1990 నుంచి 2005 వరకు ఆ రాష్ట్రంలో లాలూ హవా నడిచింది. 1990లో తొలిసారిగా లాలూ బిహార్ సీఎం అయ్యారు. 1997 నుంచి 2005 వరకు బిహార్ సీఎంగా లాలూ సతీమణి రాబ్రీదేవి వ్యవహరించారు. 2015 నుంచి 2017 మధ్యకాలంలో రాష్ట్రంలోని సంకీర్ణ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా లాలూ చిన్న కుమారుడు తేజస్వి యాదవ్ వ్యవహరించాడు. కానీ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ మంత్రి పదవికి పరిమితం అయ్యారు. దీంతో తనకు తండ్రి తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదనే అభిప్రాయానికి ఆనాడే తేజ్ ప్రతాప్ యాదవ్ వచ్చారు. 2022%-%2024 మధ్య కాలంలో సంకీర్ణ ప్రభుత్వంలో మరోసారి తేజస్వి యాదవ్ డిప్యూటీ సీఎం అయ్యారు. కానీ తేజ్ ప్రతాప్‌కు ఎలాంటి పదవీ దక్కలేదు. ఈ పరిణామంతో లాలూ కుమారుల మధ్య గ్యాప్ మరింత పెరిగింది.

**పెళ్లి తర్వాత మారిన తేజ్ ప్రతాప్ సీన్**

రాజకీయంగా తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక ఒక బలమైన కారణం ఉంటుంది. 2022-2024 మధ్యకాలంలో తేజ్ ప్రతాప్‌కు కనీసం మంత్రి పదవి కూడా దక్కకపోవడానికి కూడా ఒక కారణం ఉంది. ఆ వివరాల్లోకి వెళితే, 2018 సంవత్సరం మే 12న బిహార్ మాజీ సీఎం దరోగా ప్రసాద్ రాయ్ మనవరాలు ఐశ్వర్యా రాయ్‌తో లాలూ పెద్ద కొడుకు తేజ్ ప్రతాప్‌కు వివాహం జరిగింది. అయితే తనకు భార్య నుంచి విడాకులు ఇప్పించాలంటూ పాట్నా ఫ్యామిలీ కోర్టును 2018 నవంబరు మొదటివారంలో తేజ్ ప్రతాప్ ఆశ్రయించారు. రాజకీయ ప్రయోజనం కోసం తనకు బలవంతంగా ఈ పెళ్లి చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఆ సంబంధం వద్దని పదేపదే చెప్పినా తల్లిదండ్రులు వినలేదని వాపోయారు. దీంతో తనపై తేజ్ ప్రతాప్ దాడి చేశాడని, డ్రగ్స్ తీసుకోమని చెప్పేవాడని, క్రాస్ డ్రెస్సింగ్ చేయమనే వాడు అంటూ ఐశ్వర్యా రాయ్ కూడా కేసు పెట్టింది. ఈ విడాకుల పిటిషన్ ప్రస్తుతం ఫ్యామిలీ కోర్టులో పెండింగ్‌లోనే ఉంది. పెళ్లి చేసిన ఆరు నెలల్లోనే పెద్ద కొడుకు ఇలా చేయడం లాలూకు ఆగ్రహాన్ని తెప్పించింది. ఈ కారణం వల్లే 2022%-%2024 మధ్య కాలంలో సంకీర్ణ ప్రభుత్వంలో తేజ్ ప్రతాప్‌కు కనీసం మంత్రి పదవిని లాలూ కేటాయించలేదన్న ప్రచారం జరిగింది. దీంతో అప్పటి నుంటి లాలూ ఫ్యామిలీలో తేజ్? ప్రతాప్ ఒకవైపు, మిగతా కుటుంబ సభ్యులు మరోవైపు అన్న చందంగా మారింది. 2025లో వీరి మధ్య వివాదాలు ఒక్కసారిగా బయటకు వచ్చాయి. 2025 మే నెలలో తేజ్ ప్రతాప్ యాదవ్ సోషల్ మీడియాలో సంచలన పోస్టులు పెట్టారు. 'అనుష్క యాదవ్' అనే మహిళను రెండో వివాహం చేసుకున్నానని ప్రకటించారు. ఇది తెలుసుకున్న లాలూ అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. ఆర్‌జేడీ నుంచి, సొంతింటి నుంచి పెద్ద కొడుకును ఆరేళ్ల పాటు బహిష్కరించారు. ఇది రాష్ట్రంతో పాటు జాతీయ రాజకీయాల్లో సంచలనమైంది.

**ఆర్‌జేడీకి లాలూ కుమార్తె గుడ్‌బై**

లాలూ కుమార్తె రోహిణి ఆచార్య క్షుడా ఈ ఏడాది రాజకీయ సంచలనానికి కారణమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ ఓటమి తర్వాతా 2025 నవంబర్ 15న సోషల్ మీడియా వేదికగా ఆమె



ప్రకటన చేశారు. తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు, తన కుటుంబాన్ని వదులుకుంటున్నట్లు వెల్లడించారు. తేజస్వీ యాదవ్ సన్నిహితులు, పార్టీ కీలక నేతలైన సంజయ్ యాదవ్ (రాజ్యసభ ఎంపీ), రమీజ్ తనను అవమానించారని ఆమె ఆరోపించారు. పార్టీ ఓటమికి తననే బాధ్యురాలిని చేస్తూ వారు తనను రాజకీయాల నుంచి తప్పుకోమన్నారని తెలిపారు. రోహిణి నిర్ణయం వెలువడిన 24 గంటల్లోనే, ఆమెకు మద్దతుగా లాలూ మరో ముగ్గురు కుమార్తెలు (రాజలక్ష్మి, రాగిణి, చందా) కూడా పాట్నాలోని తమ తల్లిదండ్రుల నివాసాన్ని వదిలి ఢిల్లీకి వెళ్లిపోయారు. లాలూ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ తన సోదరి రోహిణికి మద్దతు ప్రకటించారు. సంజయ్ యాదవ్ లాంటి "బయటి వ్యక్తుల" వల్ల తన కుటుంబం నాశనమవుతోందని ఆయన విమర్శించారు. ప్రస్తుతం లాలూ కుటుంబం రాజకీయంగా రెండు వర్గాలుగా చీలిపోయింది. ఒకవైపు తేజస్వీ యాదవ్, మరోవైపు రోహిణి, తేజ్ ప్రతాప్, మిగిలిన సోదరీమణులు ఉన్నారు.